క్లుప్తంగా

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న సీఐ రమేష్

ముంచంగిపుట్టు: గంజాయి సాగు, రవాణా నిర్మూలనకు గ్రామాల్లో అందరి సహకారం అవసరమని సీఐ రమేష్ కోరారు. మండల పరిధిలోని 23 పంచాయతీల సర్పంచ్‌లతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. గంజాయి వల్ల యువతకు తీవ్ర నష్టం జరుగుతుందని, వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. ఎస్‌ఐ రవీంద్ర,సర్పంచులు పాల్గొన్నారు.

31న ఆదివాసీ సంఘం మహాసభ

వై.రామవరం: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 31న ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం ద్వితీయ ఆవిర్భావ దినోత్సవ మహాసభ ఏర్పాటు చేసినట్టు సంఘం మండల అధ్యక్షుడు ముర్ల సూరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సభకు సంఘ జిల్లా అధ్యక్షుడు లచ్చిరెడ్డి. కార్యదర్శి వెంకటేశ్వరులతోపాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ఆరోజు ఉదయం గం. 10 నుంచి సాయంత్రం గం. 5 వరకు సభ కొనసాగుతుందని పేర్కొన్నారు. సభకు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అన్ని మండలాల ఆదివాసీలు, ఆదివాసీ నేతలు, ఎస్టీ అన్ని ఉపకులాలకు చెందిన నాయకులు, ఉద్యోగులు, అన్నిరాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, విద్యార్థులు భారీ ఎత్తున హాజరై మహా సభను విజయవంతం చేయాలని సూరిబాబు కోరారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీవీటీజీ పథకాల కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు చెప్పారు. గృహ నిర్మాణశాఖ అధికారులు, సిబ్బందితో ఆయన గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఏఈ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామానికి తీరిన నీటి సమస్య



కంబాలుబయలులో పనులు పరిశీలిస్తున్న నాయకులు

జి.మాడుగుల: మండలంలో సింగర్భ సచివాయం పరిధిలో కంబాలుబయలు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తమ సొంత ఖర్చుతో తాగునీటి సమస్యను పరిష్కరించారు. పార్టీ నాయకులు గంగరాజు, చిట్టిబాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పి.రామకృష్ణ, సచివాలయ కన్వీనర్ సూర్యాప్రకాష్ నాయుడు. వార్డు సభ్యులు చెరైకి బోయస్ జె.విజయ్‌లు 500 మీటర్లు పైపును రూ.20,000 ఆర్థిక సహాయంతో పైపును కొనుగోలు చేశారు.అనంతరం శ్రమదానంతో పైపు లైన్ ఏర్పాటుచేసి నీటి సరఫరా పనులు చేపట్టారు.దీంతో కంబాలుబయలు గ్రామానికి తాగునీటి సమస్య తీరింది.

21 మందికి వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రమేష్

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ సంకిడిగొంది, నర్సీపుట్టు, మల్లుడుపుట్టు గ్రామాల్లో గురువారం కిలగాడ పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. జ్వరం, చర్మ వ్యాధులతో బాధపడుతున్న సుమారు 21 మందికి వైద్య సేవలందించి, మందులు పంపిణీ చేశారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల చెంతన.. వంతెన

వర్షాకాలం వస్తే ఆయా శివారు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లే అవకాశం లేదు.. వర్షాలు తగ్గిన తరువాతే అష్టకష్టాలు పడి చేరుకోవాల్సిందే.. ఉధృతి గెడ్డల్లో సాహసించి దిగి కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయిన సందర్భాలున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో వంతెనల కోసం గ్రామస్తులు పలుమార్లు పాలకులు, అధికారులకు వినతులిచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పలు గ్రామాల్లో వంతెనలు నిర్మించి వారి కష్టాలకు ప్రభుత్వం మోక్షం కలిగించింది.

- వంతెనతో రాకపోకలు సుగమం
- ఆనందంలో గిరిజనులు

అనంతగిరి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గిరిజనుల సమస్యలపై దృష్టి సారించింది. కలగానే మిగిలిపోతుందనుకునే గిరిజనులు సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేసింది. ఇందుకు నిదర్శనం అనంతగిరి మండలంలోని గోస్తనీ నదిపై జీలుగులపాడు, సారవానిపాలెం వంతెనలే...వర్షాకాలం అయితే ఆయా గ్రామాలకు చేరుకునేందుకు గిరిజనులు పడే వేదన వర్ణించలేం.. గోస్తనదిని దాటాలంటే ప్రాణాలతో చెలగాటం ఆడాల్సిందే. గోస్తనీ నది ప్రవాహం అధికం ఉన్నన్ని రోజులు ఆయా గ్రామాలకే గిరిజనులు పరిమితమయ్యేవారు.. అత్యవసర సమయంలోని ప్రాణాలనుపణంగా నదిని దాటేవారు.. గిరిజనులు సమస్యలను స్వయంగా చూసిన, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, గిరిజనులు పడుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకునివెళ్లారు. దీనిపై ప్రభుత్వం ఏస్‌సీఏ గ్రాంటులో ఆరు నెలల క్రితం రెండు వంతెనలకు నిధులు మంజూరుచేసింది. శరవేగంగా పనులు సాగడంతో సారవానిపాలెం వంతెన పనులు పూర్తయ్యాయి. సుమారు 10 గ్రామాలకు రాకపోకలకు సుగమమైంది..

- జీలుగులుపాడు వద్ద నిర్మాణంలోని ఉన్న వంతెన 80శాతం పనులు పూర్తయ్యాయి.

ఏస్‌సీఏ గ్రాంటు: సారవానిపాలెం 2 కోట్లు మంజూరు చేశారు.

జీలుగులపాడు 2.2 కోట్లను మంజూరు చేశారు. సారవానిపాలెం వంతెన పనులు పూర్తికావడంతో ఇప్పటికే రాకపోకలు సాగుతున్నాయి. అలాగే జీలుగుడులపాడు వంతెన పూర్తయితే విజయనగరం, అల్లూరి ఈ రెండు జిల్లాల్లో సుమారు 50 గిరిజనులకు మేలు జరుగుతుంది.



సారవానిపాలెం వంతెన

మేలు జరిగిన గ్రామాలు

సారవానిపాలెం వంతెన పూర్తికావడంతో భీంపోల్, గుమ్మకోట, గరుగుబిల్లి పంచాయతీల్లో సుమారు 10 గ్రామాలకు మేలు జరిగింది. జీలుగులపాడు వంతెన పూర్తయితే: అల్లూరి జిల్లా అనంతగిరి మండలం రొంపల్లి పంచాయతీ పసిని, మత్రివలస, గాదిల్లోవ, చినరాబ, పెదరాబ, కోటపర్తివలస, సోట్టడివలస, రొంపల్లి, కరకవలస, గూడెం, దబ్బలపాడు అల్లూరి జిల్లాకు చెందినవి. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం డీకే పర్తి పంచాయతీలోని డీకే పర్తి, అడ్డతీగ, బీటీగరువు, రేగలపాలెం, మొసలకండి, రాఘాపాలెం, అలిపర్తి, డొంబడిగరువు, చేరువలస, రాయిమానుపాడు, పెదపాడు, రేయిన్‌గరువు, వైకేపర్తి, భీమవరం గ్రామాలకు మేలు జరుగుతుంది.

మండలం: అనంతగిరి		
పంచాయతీలు	:	24
గ్రామాలు	:	418
జనాభా	:	50వేలు
వంతెనలు నిర్మిస్తున్న గ్రామాలు: సారవానిపాలెం, జీలుగులపాడు		
వంతెనలకు నిధులు	:	రూ.4.2కోట్లు



సారవానిపాలెం వద్ద వంతెన లేక గోస్తనీ నదిని దాటుకుంటూ వెళ్తున్న గిరిజనులు



జీలుగులపాడు గోస్తనీ నదినిపై నాటుపడవపై ప్రయాణిస్తున్న గిరిజనులు



జీలుగులపాడు వంతెన పనులు జరుగుతున్న దృశ్యం

జగనన్నకు కృతజ్ఞతలు



టీడీపీ ప్రభుత్వ హయంలో వంతెన నిర్మాణం కోసం విన్నవించినా ఫలితం లేకుండాపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వంతెన పనులు పూర్తయ్యాయి. మా గ్రామాలకు మేలు చేసిన జగనన్నకు కృతజ్ఞతలు.

– చిరంజీవి, సర్పంచ్, రొంపల్లి

త్వరితగతిన పనులు



సారవానిపాలెం వంతెన పూర్తి చేశాం.. జీలుగులపాడు 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణీత గడవులోగా నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేస్తాం.

– గణేష్, ఏఈ ట్రైబల్ వెల్ఫేర్ అనంతగిరి

ప్రతి గడపకు సంక్షేమం

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



పథకాల బ్రోచర్‌ను గ్రామస్తులకు అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ప్రజాప్రతినిధులు, నాయకులు

చింతూరు: అభివృద్ధి చేశాం కాబట్టే అందిన సంక్షేమ పథకాలను ఆధారాలతో సహా ప్రజలకు ధైర్యంగా తెలియజేస్తున్నామని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని ఏడుగురాళ్లపల్లి, పేగ సచివాలయాల పరిధిలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ఈ ప్రాంత గిరిజనుల అభివృద్ధి గురించి పట్టించుకోని ప్రతిపక్ష పార్టీలకు ఓట్లు అడిగే హక్కులేదన్నారు. పేదల కోసం నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో పేదలు వ్యయ ప్రయాసల కోర్చి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ప్రవేశ పెట్టారన్నారు. ప్రస్తుతం సంక్షేమ పథకాలు ఎలాంటి అవినీతికి తావులేకుండా పేదల చెంతకే చేరుతున్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుగా ఉంటుందని, ఇంకా ఎవరికైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందని వారికి పథకాలు అందేలా చూడాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఏడుగురాళ్లపల్లి సచివాలయ పరిధిలో గత నాలుగేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా 1,650 మంది లబ్ధిదారులకు రూ 7.10 కోట్లు లబ్ధి చేకూరిందని, అభివృద్ధి పనులకు రూ 3.50 కోట్లు ఖర్చు చేసినట్టు ఆమె తెలిపారు. పేగ సచివాలయ పరిధిలో గత నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా 6,260 మంది లబ్ధిదారులకు రూ 11.03 కోట్లు లబ్ధి చేకూరిందని, అభివృద్ధి పనులకు గాను రూ 4.83 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. చింతూరు పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేను ఐటీడీఏ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఆమె వారికి హామీ ఇచ్చారు. ఎస్టీ కమీషన్ సభ్యుడు చిక్కుడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీలు యడమ అర్జున్, మేడేపల్లి సుధాకర్, పీఏసీఎస్ అధ్యక్షుడు విజయ్‌రెడ్డి, సర్పంచ్‌లు సత్తిబాబు, చంద్రయ్య, కన్నారావు, సుబ్బలక్ష్మి, సత్యకుమారి, ఎంపీడీవో రవిబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామలింగారెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ కోట్ల కృష్ణ, లక్ష్మారెడ్డి, బాబూరావు, రాంప్రసాద్, మురళి, విప్లవ్‌కుమార్, పొదయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కూనవరం: మండలంలోని కొండ్రాజుపేటలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శుక్రవారం పర్యటించనున్నట్టు అడ్డతీగల సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా శబరి కొత్తగూడెం గ్రామంలో మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీలు, సర్పంచ్‌లు, వివిధ కార్పోరేషన్ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయండి



డుంబ్రిగుడలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్



ముంచంగిపుట్టులో విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

డుంబ్రిగుడ/ ముంచంగిపుట్టు: అరకు నియోజకవర్గంలోని హుకుంపేట మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు డుంబ్రిగుడలో జరిగిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సొంద్రు, గురు, ముంచంగిపుట్టులో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్ తదితరులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి తదితర అంశాలను ప్రజలకు తెలియజేసేందుకు సామాజిక సాధికార యాత్ర చేపట్టనున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముంచంగిపుట్టులో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంద, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గూడెంకొత్తవీధి: ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కాఫీ ఎకో పల్పింగ్ యూనిట్ కోసం భూమి ఇచ్చిన తమకు ఉపాధి కల్పన గాని లేక వేరే చోట భూకేటాయింపు చేయాలని రైతులు బాలకృష్ణ, దొర, సతీష్ కోరారు. తమకు న్యాయం చేయాలని వారు అధికారులను విన్నవించారు.

అరకులోయ రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం ఆందోళన చేశారు. ఈ మేరకు పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, జీతాలు రూ.26వేలు అందజేయాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు బీమా సౌకర్యం కల్పించాలన్నారు, నాయకులు వెంటలక్ష్మి, నిర్మల,లక్ష్మి, రాధభారతి పాల్గొన్నారు.

హుషారుగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



వనుగుమ్మలో వాలీబాల్ క్రీడాకారులతో వైస్‌ఎంపీపీ భాగ్యవతి



చింతపల్లిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ కోరాబు అనుషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య



అడ్డతీగల మండలం దుశ్శర్తిలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ముంచంగిపుట్టు/చింతపల్లి రూరల్/ఎటపాక/చింతూరు/అడ్డతీగల: అల్లూరి జల్లాలో ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ ఆటల పోటీలు గురువారం హోరాహోరీగా సాగాయి. గ్రామస్తులు వచ్చిన ఆటల పోటీలను తిలకించారు. ముంచంగిపుట్టులో ఎంపీడీవో కిరణ్ కుమార్, వైస్ ఎంపీపీ భాగ్యవతి పాల్గొన్నారు. చింతపల్లిలో ఆడుదాం ఆంధ్రా పోటీలను ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య ప్రారంభించారు. జీకే వీధిలో ఎంపీపీ బోయిన కుమారి, సర్పంచ్‌లు దురియా పుష్పలత, లోతా పండయ్య, ఎంపీడీవో ఆశాజ్యోతి, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి,కో–ఆప్షన్ సభ్యులు నాజర్‌వలీ, కార్యదర్శి శ్రీనివాస్ ,ఎంపీటీసీలు జయలక్ష్మి, బాబూరావు,వై నాయకులు రవి, బెన్నిబాబు తదితరులు పాల్గొన్నారు. ఎటపాకలోని గౌరీదేవిపేట, రాయనపేట, విస్సాపురంలో క్రీడా పోటీలు జరిగాయి. చింతూరులో ఆటల పోటీలను ఎంపీడీవో రవిబాబు, పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు ప్రారంభించారు. అడ్డతీగలలో పోటీలను ఎంపీడీవో బాపన్నదొర పర్యవేక్షించారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించి రెండు పూరిళ్లు దగ్ధంకాగా బాధిత కుటుంబాలకు సర్పంచ్ మిరియాల గణలక్ష్మి తక్షణ సహాయం అందజేశారు. అగ్ని ప్రమాదం కారణంగా పొట్టబోయిన మారయ్య, అతని కుమారుడు నాగరాజు (పండు) కుటుంబాలు సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో వీధిన పడ్డారు. వీరికి సర్పంచ్ గణలక్ష్మి 50 కిలోల బియ్యం, రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం దృష్టికి ప్రమాద వివరాలను అందజేసి న్యాయం జరిగేలా చూస్తానని సర్పంచ్ గణలక్ష్మి హామీ ఇచ్చారు. వ్యవసాయ సలహా మండల చైర్మన్ వెంకటరమణ పాల్గొన్నారు. సీఐ స్వామి నాయుడు, రాజవొమ్మంగి ఎస్‌ఐ వెంకయ్య సంఘటనా స్థలానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రగ్గులు, నిత్యావసర వస్తువులు అందజేశారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఎటపాక: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటిఎఫ్) 2024 క్యాలెండర్, డైరీలను గురువారం తహసీల్దార్ పృథ్వీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో సరియం రాజులు మాట్లాడుతూ యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సాగర్, శ్రీనివాస్, ప్రసాద్, రత్నారావు, నూకరాజు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అనంతగిరి: మండలంలోని తైడ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త రావులవలస రామచంద్రరరావు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు , హోమం జరిపారు. అమూల్య ఫౌండేషన్ ఆధ్వర్యంలోని పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

దోమతెరల పంపిణీ



దోరతెరలు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ, రంగబయలు పంచాయతీ బుడపనస, ఏనుగురాయి పంచాయతీ పరాతపుట్టు గ్రామాల్లో గురువారం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు, కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కో–ఆర్డినేటర్ వి.లోహితసుడు గిరిజనులకు దుప్పట్లు, దోమతెరలను పంపిణీ చేశారు. శారద నికేతన్ పాఠశాల విద్యార్థులకు మాస్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లోహితసుడు మాట్లాడుతూ దాతల సహకారంతో రెడ్‌క్రాస్ ద్వారా అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తం సేకరించి పేదలకు అత్యవసర సమయాల్లో ఆదుకుంటున్నామన్నారు. సర్పంచ్ త్రినాథ్, గిరిజన సంఘం నేతలు శ్రీను, భాస్కర్, దీలిప్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



ప్రార్థన చేస్తున్న హెచ్‌జేసీఎం డైరెక్టర్ మాణిక్యం



రగ్గులు పంపిణీ చేస్తున్న ఏఎంసీ డైరెక్టర్ స్మిత్

అరకులోయ రూరల్: మండలంలోని లోతేరు పంచాయతీ పొల్లిగూడ గ్రామ హెచ్‌జేసీఎం చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హెచ్‌జేసీఎం డైరెక్టర్ మాణిక్యం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థన చేశారు. క్రీస్తు సందేశాన్ని వినిపించారు. క్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయమన్నారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. భారీ విందు ఏర్పాటుచేశారు. పాస్టర్లు జాన్‌పీటర్, జీవన్, జ్ఞానమ్మ పాల్గొన్నారు.

రంపచోడవరం : తామరపల్లిలోని మాసిదోనియా చర్చిలో పాస్టర్ డేవిడ్ రాజు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఏఎంసీ డైరెక్టర్ దూర స్మిత్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అనుసరించాలని, పేదలను ఆదుకోవాలని కోరారు. రగ్గులు, చీరలు పంపిణీ చేశారు. పాస్టర్ శామ్యూల్, రత్నం, ఏవో లక్ష్మణ్, కర్నేంద్ర వరప్రసాద్, సుంచు సన్నీ, తమస్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పాయం రంగమ్మ

కూనవరం: సమస్యలు పరిష్కారానికి శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశానికి కొందరు అధికారులు గైర్హాజరు కావడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపటాల్సిన ఇంటింటికి కుళాయి పనుల పరిశీలనను డ్వాక్రా గ్రూపులకు అందజేసే విషయాన్ని అధికారులు ప్రజాప్రతినిధులకు తెలియనీయక పోవడం ఆశ్చర్యం కలిగిస్తుందని జగ్గవరం సర్పంచ్ కారం పార్వతి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన పనులు చేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని చినార్కూరు సర్పంచ్ సున్నం అభిరామ్ అన్నారు. పోలవరం నిర్వాసితుల భూముల్లో తుపానుకు దెబ్బతిన్న పంటల వివరాలను ఏవో శ్రీలక్ష్మి తెలియజేశారు. ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, తహసీల్దార్ కె.అనసూయ, ఎంపీటీసీ సభ్యులు అనంతలక్ష్మి, వెంకటేశ్వరరావు, నాగరాణి, సర్పంచ్‌లు కార్యదర్శులు పాల్గొన్నారు.